విశాలాంధ్ర గుంటూరు జిల్లా

చెరువు నీరు బయటకు పంపండి

విశాలాంధ్ర-తాడికొండ : తరతరాలుగా భూమిని సాగు చేసుకుని బతుకుతున్నాం...... ఆ భూమి మాకు జీవనాధారం..... ఇటీవల కురిసిన వర్షానికి తమ పంటలు పూర్తిగా మునిగిపోయాయి. తిరిగి పంటలు వేసుకోవడానికి చెరువులో నీరు ఉంది. నీరు బయటకు పంపాలని గ్రామ దళితులు స్థానిక తహశీల్దార్ ఫణీంద్రను సోమవారం కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. వంద సంవత్సరాలుగా అక్కదేవతల చెరువు భూమిని సాగు చేసుకుని బతుకుతున్నాం. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువ మొత్తంలో వరి పంటను సాగు చేసుకుంటున్నాం వర్షం వచ్చి మా పంటలు పూర్తిగా మునిగాయి. నీరు బయటకు పంపితే రెండో పంట వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని దళితులు తహశీల్దార్‌కు తెలిపారు. అలాగే పంట నష్టపోయిన తమకు పరిహారం ఇప్పించాలని వేడుకున్నారు. ఇరిగేషన్ ప్రభుత్వ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామ దళితులు వెనుతిరిగారు.

కార్తీక వనసమారాధన

విశాలాంధ్ర, తెనాలి : పట్టణంలో సోమవారం సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించుకున్నారు. పట్టణంలో ఉదయం నుండి మహిళలు పెద్దసంఖ్యలో శివాలయాలకు వెళ్ళి పూజాది కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని మాట్లా డుతూ సామూహిక సమారాధనల వలన ప్రజల్లో స్నేహభావం, ప్రేమా భిమానాలు పెంపొందుతాయని హితవు పలికారు. మహిళలు అన్ని రంగాల్లో నేడు ముందంజలో ఉన్నారని ఈ ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను తీసువచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళకు తృటిలో తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర-తాడేపల్లి : రైల్వే గేట్ వద్ద ట్రైన్ వస్తుందన్న కంగారులో మహానాడుకు చెందిన ఐలమ్మ డ్వాక్రా గ్రూపుకు చెందిన వనపర్తి లక్ష్మి కింద పడిపోయింది. ఈలోపు ట్రైన్ రావడంతో తన చేతిలో ఉన్న బ్యాగ్‌ను ట్రైన్ లాక్కుపోయింది. బ్యాగ్ నుజ్జు నుజ్జు కావటంతో అందులోని డ్వాక్రాకు కట్టవలసిన రూ.80,400 కొట్టుకుపోయాయి. చుట్టు పక్కల వారు ఆమెను కాపాడి కొట్టుకుపోయిన నగదు సేకరించిగా రూ.60 వేలు దొరికాయి. రూ.20 వేలు మహిళ పోగొట్టుకుంది. పేద కుటుంబమని ఆ డబ్బు ఎక్కడి నుంచి తేవాలని బోరున విలపిస్తుంది.

ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సుకు రవికిరణ్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రపంచ దేశాల పారిశ్రామిక వేత్తలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ప్రముఖ పారిశ్రామికవేత్త నీలం రవికిరణ్ పిలుపునిచ్చారు. ప్రపంచ 27వ పెట్టుబడిదారుల సదస్సు (వరల్డ్ ఇన్‌వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్)కు గుంటూరు వాసి ప్రముఖ పారిశ్రామికవేత్త నీలం రవికిరణ్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులో నీలం రవికిరణ్ పాల్గొని మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థ రానున్న ఉత్పత్తి రంగానికి ఎంతో అవకాశం ఉందన్నారు. ప్రపంచ దేశాల్లో ఎన్నో విపత్తులు సంభవించిన భారత్ మాత్రం ప్రపంచ దేశాలకు చేయూత అందించే స్థాయికి చేరిందని కొనియాడారు. పెట్టుబడిదారులకు భారత్ ఎంతో అనుకూలమైన ప్రదేశమని అన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆహార ధాన్యం కొరత ఏర్పడే ప్రమాదం ఉందని, ప్రపంచ దేశాలలో స్థిరంగా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ముందుందని ప్రశంసించారు. ప్రపంచ దేశాలకు ఆహార ధాన్యాలను పండించి ఉత్పత్తి రంగంలో భారతదేశం ఎంతో అనుకూలమైందని అన్నారు. ఈ సదస్సులో ప్రపంచ దేశాల పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు.

'అరవింద' విద్యార్థులకు బహుమతులు

విశాలాంధ్ర-తాడేపల్లి: ప్రతి సంవత్సరం లలిత కళా ఉత్సవం పేరుతో శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్‌లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే వివిధ రకాల పోటీలలో అరవింద స్కూల్ విద్యార్థులు బహుమతులు పొందినట్లు అరవింద ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ ఇంద్రాణి తెలియజేశారు. కవితా రచనలో సీనియర్స్ విభాగంలో వి.జస్మితారెడ్డి, కథరచనలో గౌస్ భాష, బృందగానంలో వి.అశ్విత బృందం, శాస్త్రీయ సంగీతంలో కే సత్య సుబ్రహ్మణ్య శ్రీకర్ బహుమతులు పొందినట్లు, సంగీతపు ఉపాధ్యాయురాలు జోష్నికి నగదు బహుమతి, మెమెంటోతో సత్కరించినట్లు ఆమె తెలియజేశారు. విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు.

న్యాయవాద వృతిలో రాణించి పేదలకు సాయం చేయాలి: జేసీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రభుత్వం తరపున అందిస్తున్న స్టైఫండ్‌ను యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకొని, న్యాయవాద వృత్తిలో రాణించి పేద ప్రజలకు న్యాయసహాయం అందించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 2023-24 సంవత్సరానికి వైఎస్సార్ లా నేస్తం రెండో విడత నిధులు వర్చువల్‌గా ఆన్లైన్‌లో జమ చేసే కార్యక్రమంలో గుంటూరు కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, శాసన మండలి సభ్యులు మురుగుడు హనుమంతరావు, శాసన సభ్యులు మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్‌పర్సన్ మందపాటి శేషగిరి రావు, ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి తదితరులు పాల్గొని వీక్షించారు. కార్యక్రమం అనంతరం సంయుక్త కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. జిల్లాలో న్యాయ శాస్త్రంలో పట్టా పొంది న్యాయవాదులుగా బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొన్న 243 మంది జూనియర్ న్యాయవాదులకు వైయస్సార్ లా నేస్తం ద్వారా ముఖ్యమంత్రి నెలకు రూ. 5వేలు చొప్పున సంవత్సరానికి రూ.60వేలు వంతున మూడు సంవత్సరాలకు 1,80,000లు అందిస్తున్నారన్నారు. 2023-24 సంవత్సరంలో రెండవ విడతలో జులై నుండి డిసెంబర్ వరకు ఆరు నెలలకు రూ. 30,000 వంతున మొత్తం రూ. 69,75,000 లు అందించారన్నారు. జిల్లాలో 569 మందికి రూ.10 కోట్ల 24 లక్షల 20 వేలు స్టైఫండ్ ఇవ్వడం జరిగిందన్నారు.

స్పందనకు 190 ఫిర్యాదులు

సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జిల్లా సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, డీఆర్ఓ చంద్రశేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీంద్ర రావు, లక్ష్మీ కుమారి, ఆర్డీఓ పి.శ్రీఖర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి 190 అర్జీలను స్వీకరించారు. సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి నిర్ణీత గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ కుయుక్తులపై బీసీలు అప్రమత్తంగా ఉండాలి: నిమ్మల

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: బలహీనవర్గాలను రాజకీయంగా బలి పశువులను చేసేందుకు... అగ్రవర్ణాలతో విభేదాలు పెట్టేందుకు మంగళగిరి డ్రామాకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పథకం రచించిందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ నిమ్మల శేషయ్య పేర్కొన్నారు. సోమవారం గుజ్జనగుండ్లలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డిని ఒక పథకం ప్రకారం తప్పించి బీసీల కోసమే తప్పించినట్లు తప్పుడు ప్రచారానికి వైసీపీ వ్యూహం పన్నిందని ఆయన తెలిపారు. వైసీపీకి నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే జిల్లాలో మంగళగిరితో పాటు బీసీలకు దామాషా ప్రకారం రావలసిన సీట్లని కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు అన్ని విధాల గత నాలుగున్నర సంవత్సరాలుగా అన్యాయం చేసిన వైసీపీ 2024 ఎన్నికల్లో రాజకీయంగా కూడా మరింత బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. బీసీలకు అగ్రవర్ణాలకు మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు సామాజిక మాధ్యమాల ద్వారా మంగళగిరి వ్యవహారంలో బూటకపు ప్రచారానికి తెర లేపిందన్నారు. ఎవరు పోటీ చేసిన నారా లోకేష్ భారీ మెజార్టీతో 2024 ఎన్నికల్లో మంగళగిరి ఎమ్మెల్యేగా గెలవడం తథ్యమని సర్వేల ద్వారా తెలుసుకున్న వైసిపి బీసీలను బలి పశువులను చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. వైసిపి ఆడుతున్న రాజకీయ జూదంపై బీసీలు అప్రమత్తంగా ఉండాలని వైసీపీ కుటిల ప్రయత్నాలను తిప్పి కొట్టాలని ఆయన కోరారు. 1983 నుంచి టిడిపికి వెన్నుదన్నుగా ఉన్న బీసీలు 2024 ఎన్నికల్లో పూర్తిస్థాయిలో మద్దతుగా నిలిచి టీడీపీ జనసేన కూటమిని అధికారంలోకి తేవడం తథ్యమని డాక్టర్ నిమ్మల శేషయ్య పేర్కొన్నారు.

ప్రతి పేదవాడి ఇంటికి సంక్షేమ లబ్ధి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రతి పేదవాడి ఇంటికి సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మా నమ్మకం నువ్వే జగన్'అనే కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని 53వ డివిజన్ వెంగళరావు నగర్‌లో సోమవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా ప్రజల బాధక సాధకలు గురించి అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందని సంక్షేమ పథకాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందుతున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిరుపేదల కుటుంబాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొందని అన్నారు. అదేవిధంగా విద్య, వైద్య విషయంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో 53వ డివిజన్ కార్పొరేటర్ దూపాటి వంశీ, డివిజన్ అధ్యక్షులు సాల్మన్, వైసీపీ నాయకులు పూనూరి నాగేశ్వరరావు, జేపీ రెడ్డి, అగ్గిపెట్టి రాజు, రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : తుఫాన్ వల్ల పంట నష్టపోయిన ప్రతి రైతుని రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ టీడీపీ కార్యాలయంలో అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు, కేళి వెంకటేశ్వరరావు, ధారా దాసు, బెజ్జం రామకృష్ణలు మాట్లాడుతూ తడిచి రంగు మారి మొలకెత్తిన ప్రతి ధాన్యం గింజనూ పొలం వద్దే మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. రాష్ట్రంలో తుఫాన్ విధ్వంసంతో నష్టపోయిన ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. వాతావరణ శాఖ పది రోజులుగా తుఫాన్ హెచ్చరికలు జారీచేస్తూనే ఉన్నా సీఎం జగన్‌లో చలనం రాలేదని అన్నారు. నష్టపోయిన వరి రైతులకు ఎకరాకు రూ.30 వేలు, వాణిజ్య పంట రైతులకు ఎకరాకు రూ.50 వేలు చొప్పున పరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ తెలుగు యువత అధ్యక్షులు గుద్దంటి నాగేశ్వరరావు, తాడేపల్లి పట్టణ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కంభం సాయిచంద్, మేక పుల్లారెడ్డి, బెజ్జం కుమార్, తాళ్లూరు శ్రీనివాసరావు, పోతబత్తిన శ్రీనివాసరావు, కొయ్యగూర నాగమల్లేశ్వరరావు, దేరంగుల సింహాచలం, సిహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. కరోనా కాలంలో రెండు సంవత్సరాలు పనిచేసిన కార్మికులను కొనసాగించాలని, వృద్ధాప్య, అనారోగ్య రీత్యా పనులు చేయలేకపోతున్న పారిశుద్ధ్య కార్మికుల పిల్లలను వారి స్థానంలో పనులకు నియమించాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరు నగర జనాభా పెరుగుదలకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బదిలీ వర్కర్లను ఆప్కోస్ వర్కర్లుగా నమోదు చేయాలని అన్నారు. యూనియన్ గుంటూరు నగర అధ్యక్షులు బందెల రవికుమార్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, గ్రాడ్యూటీ చట్టాన్ని అమలు జరపాలని, కార్మికులందరికీ ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ సలహాదారు వెంకట్రావు, సద్గుణ రావు దేవన్ కుమార్, రమేష్, సాంబయ్య, కమలమ్మ, లక్ష్మి, సువార్తమ్మ, కోటేశ్వరరావు, వెంకట్రావు, దానియల్, ఏడుకొండలు, కిరణ్, శ్యామ్ ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలకు మంచినీరు, విద్యుత్ అందించాలి : సీపీఐ

విశాలాంధ్ర-పొన్నూరు: టిడ్కో గృహాలలో మంచి నీరు, విద్యుత్ సౌకర్యం పూర్తిగా కల్పించాలని సిపిఐ అధ్యక్షుడు ఆరేటి రామారావు టిడ్కోలు గృహ యజమానులతో కలిసి సోమవారం మున్సిపల్ కమిషనర్ నయుం అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. ఉదయం ఇస్తున్న మంచినీరు 3వ ఫ్లోర్ వరకు అందటం లేదని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, విద్యుత్ సౌకర్యం లేదని తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. సిపిఎంఎల్ గోగినేని పరుశురామయ్య పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర, తెనాలి : అగ్రిగోల్డ్ బాధితుల డిపాజిట్ల సొమ్మును వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అగ్రి గోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేస్తుంది. సోమవారం సత్యాగ్రహ దీక్షను తెనాలి దీక్షా చౌక్‌లో జిల్లా కార్యదర్శి కె.అగస్టీన్ ప్రారంభించి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే తమ సమస్య పరిష్కరిస్తానని చెప్పిన జగన్ ప్రభుత్వం హామీ పరిష్కారంలో విఫలమైందన్నారు. యుద్ధప్రాతిపదికన చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28,29 తేదీల్లో విజయవాడలో 30 గంటలు మహాధర్నాకు పిలుపునిచ్చారని చెప్పారు ఇప్పటికైనా ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. జిల్లా నాయకులు బషీర్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంస్థకు 30వేల కోట్లు అస్తు లున్నాయని, 3వేల కోట్లు ఇచ్చి న్యాయం చేయాల్సిన ప్రభుత్వం తమకేమీ పట్ట నట్లుగా వ్యవహరిస్తుందన్నారు. బాధితులు 40 లక్షలకు పైగా వున్నారని అయినా ముఖ్యమంత్రి పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకనే ఓడిపోయిందని గుర్తు చేశారు. మంత్రులు, శాసనసభ్యులు కూడా స్పందించి అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కరించాలని కోరారు. దీక్షలో బషీర్, సిహెచ్. నరసింహారావు, తిరుమలరావు, చందు, వెంకటేశ్వరరావు, సుధాకర్, శ్రీనివాసరావు, సూర్యప్రకాష్, గోవిందు, యాదగిరి, సాయి, ప్రసాద్, ఎఐటీయుసి నాయకులు బొల్లిముంత కృష్ణ, గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే మోదీ లక్ష్యం

విశాలాంధ్ర-ఫిరంగిపురం : రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించేందుకే భారత ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా ఎంచుకున్నారని ఈఓపీఆ ర్‌డీ ఎంఎస్ లక్ష్మీకుమారి అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని మేరిగపూడి, శిరంగిపాలెం గ్రామాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఈఓపీఆర్‌డీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 17 రకాల పథకాల గురించి అర్హులందరూ లబ్ధిపొందాలన్న గొప్ప ఆలోచనతో మోదీ హామీ రథంను ప్రతి గ్రామానికి ప్రచారం చేస్తుందన్నారు. మండలంలోని ఆయా శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పథకాల గురించి ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కంజుల పద్మావతి, బ్రహ్మారెడ్డి, చుక్కా శాంతమ్మ, ఎంపీటీసీలు హనుయామ్మ, ఎస్తేరు రాణి, కార్యదర్శులు విష్ణువర్ధన్ రావు, ధర్మారాజు, ఆయా శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది, బీజేపీ నాయకులు గొర్రెపాటి చంద్రశేఖర్ రావు, రావూరి నారాయణ రావు, కంతేటి బ్రహ్మయ్య, హనుమంతరావు, చందు సాంబశివరావు, వనమా నరేంద్ర, ఈదర శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పర్మినెంట్ చేయాలని రాష్ట్ర మున్సిపల్ అధికారికి ఏఐటీయూసీ నాయకులు మెమోరాండం ఇచ్చారు. సోమవారం మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ శానిటేషన్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గండికోట దుర్గారావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్యలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు పాదయాత్ర చేస్తున్న సమయంలో మున్సిపల్ శానిటేషన్ కార్మికులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేసినప్పుడు తాను అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ కార్మికులందరికీ పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు దాటిన ఈ విషయంలో ఎలాంటి ముందడుగు వేయలేదన్నారు. కరోనా సమయంలో మరణించిన శానిటేషన్ కార్మికులకు రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీవో నెంబర్ 30ని సరిచేసి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ముద్రబోయిన కృష్ణ, తాడిశెట్టి శ్రీను, గోపాటి రాయుడు, వేల్పూరి తులసీదాస్, కురగంటి సుకన్య వీరదాసు మరియమ్మ, తాడిశెట్టి కోటేశ్వరరావు, వేల్పూరి వెంకటలక్ష్మి, బట్టు సుభాషిని, మిరియాల బుజ్జి, చెన్నుబోయిన నరసయ్య, వీర్ల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో వెంకటేష్ సందడి

విశాలాంధ్ర-తాడేపల్లి : కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో సైంధవ్ చిత్రం హీరో వెంకటేష్, నటి శద్ధా శ్రీకాంత్‌లు సోమవారం సందడి చేశారు. టాలీవుడ్ చిత్రం సైంధవ్‌లోని సరదా సరదాగా అనే పాటను విద్యార్థుల కేరింతల మధ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్రం టీజర్‌ను ప్రదర్శించి అలరించారు. చిత్రం దర్శకుడు హిట్ ఫేం శైలేష్ కొలను మాట్లాడుతూ హీరో వెంకటేష్ కాంపౌండ్ నుంచి వస్తున్న చిత్రం సైంధవ్ చిత్రం 2024 జనవరి 13న సంక్రాంతి కానుకగా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుందని తెలిపారు. ఈ సందర్భంగా టాలీవుడ్ నటుడు వెంకటేష్ మాట్లాడుతూ సైంధవ్ చిత్రం తనకు 75వ సినిమాగా చెప్పారు. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న సైంధవ్ చిత్రం ప్రేక్షకుల మన్ననలను అందుకుంటుందని అన్నారు. విద్యార్థులతో హీరో వెంకటేష్ ముచ్చటించారు. విద్యార్థి దశ నుంచి జీవితంలో సర్దుకుపోవడం నేర్చుకోవాలన్నారు. ప్రతిఒక్కరినీ గౌరవించడం తెలుసుకున్నప్పుడే అన్ని రంగాలలో రాణిస్తారని తెలిపారు. ఇటీవలే మేకర్స్ లాంఛ్ చేసిన సైంధవ్ ఫస్ట్ సింగిల్ ట్రాక్‌ను చంద్రప్రస్థ ఫిక్షనల్ పోర్ట్ ఏరియా బ్యాక్‌డ్రాప్‌లో సాగే మిషన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న సైంధవ్‌లో జెర్సీ ఫేం శ్రద్ధా శ్రీనాథ్ ఫీమేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీతో బాలీ వుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్దిఖీ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నట్లు చిత్ర బృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత వెంకట్ బొయిన పల్లి, వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థ సారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంత రావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్
గుంటూరు బ్రాంచి (0028), యస్.వి.ఆర్. ఎంపైర్, శనక్కాయల ఫ్యాక్టరీ రోడ్, కొత్తపేట, గుంటూరు-522001. ఫోన్: 0863-2223997, 2220519. ఇ-మెయిల్: iob0028@iob.in

ఋణగ్రహీతలు/ తనఖాదారులు/హామీదారులకు సంక్షిప్త డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు- 2002 యొక్క 3(1) రూలుతో కూడిన సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (SARFAESI చట్టం) యొక్క 13(2) విభాగం ప్రకారం.
1) SARFAESI చట్టం ప్రకారం క్రింద సంతకందారు ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి మరియు నియమావళి యొక్క 3వ నియమంతో కూడిన 13(12) విభాగం క్రింద సంక్రమించిన అధికారములతో సదరు చట్టం 13(2) విభాగం ప్రకారం దిగువ జాబితాతో పేర్కొనబడిన ఋణగ్రహీతలు/ తనఖాదారులు/ హామీదారులు (ఇప్పటి నుండి ఋణగ్రహీతలు గా పరిగణింపబడతారు)లు క్రింద తెలిపిన వివరాల ప్రకారం నోటీసులో తెలపబడిన మొత్తములను నోటీసు స్వీకరణ తేది నుండి 60 దినములలోగా చెల్లింపు చేయవలసినదిగా డిమాండ్ నోటీసు జారీ చేసినారు.
2) సదరు నోటీసులు బట్వాడా కాకుండా పోస్టల్ అథారిటీ వారిచే తిరిగి వచ్చినవి లేదా ఋణగ్రహీతలు/ తనఖాదారులు/ హామీదారులు స్వీకరించినట్లు ధృవీకరించలేదు. సదరు నోటీసు కాపీలు దిగువ సంతకందారుని వద్ద లభిస్తాయి మరియు ఈ నోటీసు కాపీలను పొందగోరిన సదరు ఋణగ్రహీతలు/ తనఖాదారులు/ హామీదారులు దిగువ సంతకందారు నుండి ఏపనిదినమునైనా సాధారణ ఆఫీసువేళలలో పొందవచ్చును.
3) పై నేపథ్యం(అంశము) ఆధారంగా ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 దినములలోగా ఈ దిగువ సూచించిన మొత్తములు సదరు తేది నుండి ఋణం మరియు ఇతర డాక్యుమెంట్ల ప్రకారం చెల్లింపు చేయు తేది వరకు ఒప్పందపు రేట్ల ప్రకారం భవిష్యత్తు వడ్డీతో సహా ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ వారికి చెల్లించవలసినదిగా సదరు ఋణగ్రహీతలు/ తనఖాదారులు/ హామీదారులు మరొకసారి ఈ ప్రకటన మూలముగా కోరటమైనది. ఋణబకాయిలు తిరిగి చెల్లింపు చేయు నిమిత్తం సెక్యూరిటీగా దిగువ తెలిపిన ఆస్తులను సంబంధిత ఋణగ్రహీతలు ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ వారికి తనఖా పెట్టియున్నారు.

ఋణగ్రహీతలు/ తనఖాదారులు/హామీదారుల పేర్లు మరియు చిరునామా
1.ఋణగ్రహీతలు : ఖాసియో బ్యాటరీస్, యజమాని: మొగిలి ఆంజనేయులు, ఫ్లాట్ నెం.5, బ్లాక్ నెం.22ఎన్, ఫేజ్-4, ఆటోనగర్ గుంటూరు-522001, ఆంధ్రప్రదేశ్.
2) ఋణగ్రహీతలు/ తనఖాదారులు : మొగిలి ఆంజనేయులు, తండ్రి : బ్రహ్మయ్య, 7-6-846/45, 6/5 రాజీవ్ గాంధీ నగర్, గుంటూరు-522001.
బకాయి మొత్తం : 1.టర్మ్‌లోన్-002803628000002 - రూ.56,14,481.00, 2. జిఇసిఎల్‌జిఎస్-002803510000011 - రూ.4,23,332.00, 3.టిఒడి-002802000005366 - రూ.64,184.00. మొత్తం: ది.31-10-2023 నాటికి రూ.61,01,997.00 (అక్షరాల అరవై ఒక్క లక్షల ఒక వెయ్యి తొమ్మిది వందల తొంభైఏడు రూపాయలు మాత్రమే).

సెక్యూర్డ్ ఆస్తుల వివరములు
1. హైపోతికేషన్: బుక్స్‌లోని డెట్స్ మరియు స్టాక్స్ యొక్క హైపోతికేషన్.
2. తనఖావుంచబడిన ఆస్తి వివరములు: గుంటూరు టౌన్, అగతవరప్పాడు, సర్వో సిస్టమ్స్ ఎదురు, ఆటోనగర్, ఎపిఐఐసి ఐలా ఫేజ్-4, బ్లాక్ నెం.22ఎన్, ఫ్లాట్ నెం.5, డి.నెం.185 నందలి శ్రీ మొగిలి ఆంజనేయులు పేరుతో గల 130.74 చ॥గ॥ల విస్తీర్ణము గల భూమి అందులోని మూడు అంతస్తుల ఇండస్ట్రియల్ భవనమునకు సంబంధించిన న్యాయసమ్మతంగా తనఖావుంచబడిన ఆస్తి. దీనికి హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం.13, పడమర: 20అ॥ల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం: ఫ్లాట్ నెం.4, దక్షిణం: ఫ్లాట్ నెం.6.

యన్‌పిఏ తేది : 30-06-2023 డిమాండ్ నోటీసు తేది : 14-11-2023

పైన తెలిపిన తేది నుండి చెల్లింపు చేయు తేది వరకు అంగీకరించిన ఒప్పందపు రేట్ల ప్రకారం తదుపరి వడ్డీ/ మిగిలినవి చెల్లించాలి.
4) పైన తెలిపినట్లుగా ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ వారికి చెల్లింపు చేయుటలో సదరు ఋణగ్రహీతలు / తనఖాదారులు విఫలమైనచో SARFAESI చట్టం 13(4) విభాగం మరియు సదరు నియమావళి ప్రకారం ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ వారు పై సెక్యూర్డ్ ఆస్తుల పై తగు చర్యలు చేపట్టెదరు మరియు అందుకు ఎదురయ్యే అన్ని ఖర్చులు మరియు పరిణామములకు సదరు ఋణగ్రహీతలు / తనఖాదారులు బాధ్యులగుదురు.
5) ఇంకను తెలియపరచునది ఏమనగా, చట్టంలోని 13వ విభాగం లోని ఉప విభాగం (8) నియమముల క్రింద లభించే సంబంధిత కాలం పరిధిలో తమ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవలసినదిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.
6) అలాగే ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ వారి ముందస్తు లిఖిత అనుమతి లేకుండా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా మార్గముల ద్వారా సెక్యూర్డ్ ఆస్తులను మీరు బదిలీ చేయుట SARFAESI చట్టం ప్రకారం నిషేదించడమైనది. ఏ వ్యక్తి అయినా చట్టం లేదా నియమావళిలోని నియమాలను ఉల్లంఘించిన లేదా వ్యతిరేకతను ప్రోత్సహించిన సదరు చట్టంలోని 29వ విభాగం ప్రకారం జైలు శిక్ష మరియు / లేదా జరిమానా విధించబడుతుంది.

ప్రదేశం : గుంటూరు — సం/- అధీకృత అధికారి
తేది : 11-12-2023 — ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్

FEDBANK FINANCIAL SERVICES LIMITED
ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: ఎ వింగ్, యూనిట్ నం.511, కనకియా వాల్ స్ట్రీట్, అంధేరి - కుర్లా రోడ్, అంధేరి ఈస్ట్, ముంబై, మహారాష్ట్ర - 400093

వేలం మరియు అమ్మకం కోసం పబ్లిక్ నోటీసు

ఇందుమూలంగా సాధారణ ప్రజలకు, ప్రత్యేకించి రుణగ్రహీత / సహ-రుణగ్రహీత / హామీదారుకి ప్రత్యేకించి తెలియజేయునది ఏమనగా, ఈ క్రింద వివరించిన స్థిర ఆస్తి ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌కు తనఖా పెట్టబడమైనది. ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి స్వాధీనంలోకి తీసుకున్న సదరు స్థిర ఆస్తిని "ఎక్కడ ఉన్నది ఉన్నట్లుగా", "ఏముంటే అది" మరియు "అక్కడ ఉన్నది ఏదైనా" ప్రాతిపదికపై విక్రయించబడుతున్నది. స్థిర ఆస్తి విక్రయం కొరకు అధీకృత అధికారి ద్వారా మా సర్వీస్ పార్ట్నర్, ఎం/ఎస్. సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యొక్క వెబ్ పోర్టల్ అనగా...https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించడానికి ఆఫర్‌లను ఆహ్వానించడమైనది. దీని వివరాలు కింద పేర్కొనడమైనది. మరియు విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎఫ్ఇడిఎఫ్ఐఎన్ఎ) సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ అనగా www.fedfina.com నందు అందుబాటులో ఉంచిన లింకును పరిశీలించగలరు. & https://www.fedfina.com/public-notice-for-auction-cum-sale/.

ఆస్తుల వివరాలు	గుంటూరు జిల్లా ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రీలోని నడింపాలెం గ్రామ పరిధులకు చెందిన డిమార్కేషన్ నెం.386, అసెస్‌మెంట్ నెం.564లో ఆర్‌సిసి పైకప్పు నిర్మాణాలతో 130 చదరపు గజాల విస్తీర్ణం లేదా 108.69 చదరపు మీటర్ల విస్తీర్ణపు స్థలం.
రిజర్వు ధర (రూ.లలో)	రూ. 10,96,271/- (పది లక్షల తొంభైఆరు వేల రెండు వందల డెబ్బై ఒక్క రూపాయలు మాత్రమే)
'ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్' పేరిట డిడి/ పిఓ ద్వారా ధరావత్తు సొమ్ము డిపాజిట్ (రూ.లలో)	రూ. 1,09,627/- (ఒక లక్ష తొమ్మిది వేల ఆరువందల ఇరవై ఏడు రూపాయలు మాత్రమే)
బిడ్ పెంపుదల మొత్తం	రూ. 50,000/- (యాభై వేల రూపాయలు మాత్రమే)
ఇఎండితో టెండరు/సీలువేసిన ఆఫర్‌తో బిడ్ల సమర్పణ కొరకు చివరి తేదీ, సమయం మరియు వేదిక	29 డిసెంబరు, 2023 సా.05:00 గంటల వరకు. డోర్ నెం: 6-10-54, జయ సిన్హా ప్రైడ్, 2వ అంతస్తు, అరండల్‌పేట, 10/3 లైన్, ఆర్య సమాజం ఎదురుగా, గుంటూరు-522002.
బిడ్లు తెరుచు తేదీ & సమయం:	02 జనవరి, 2024, ఉదయం 10:00 గంటల నుండి 10:30 గంటల వరకు
ఆస్తుల తనిఖీ	27 డిసెంబరు, 2023, సా. 5గంటల ముందు.
విజయవంతమైన బిడ్డర్ ధ్రువీకరణకు అంగీకరించిన అత్యధిక బిడ్‌లో 25% (ఇఎండి సహా) చెల్లింపు కొరకు చివరి తేదీ	బిడ్ ధ్రువీకరించిన తేదీ నుంచి తదుపరి పనిదినంలో చెల్లింపు చేయవలెను.
అత్యధిక బిడ్‌లో మిగిలిన 75% చెల్లింపు కొరకు చివరి తేదీ	బిడ్ ధ్రువీకరించిన తేదీ నుంచి 15 రోజుల్లోగా.
రుణం వివరాలు	లోన్ ఎ/సి నం. FEDVIJ0HL0487334 శ్రీ కొప్పురావూరి సుధాకర్ (రుణగ్రహీత), శ్రీమతి కొప్పురావూరి నాగలక్ష్మి (సహ-రుణగ్రహీత)
భవిష్యత్తు వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో మొత్తం బకాయిలు	20/11/2023 నాటికి రూ. 30,92,611/- (ముప్పై లక్షల తొంభై రెండు వేల ఆరువందల పదకొండు రూపాయలు మాత్రమే)

విక్రయం యొక్క ముఖ్య నియమాలు & షరతులు:
(1) బిడ్ డాక్యుమెంట్ యొక్క తదుపరి నిబంధనలు మరియు షరతుల ప్రకారం మరియు అందులో పేర్కొన్న విధానం ప్రకారం వేలం నిర్వహించబడును. బిడ్డర్లు బిడ్ డాక్యుమెంట్లు, ఇ-వేలం కోసం ఉంచిన హామీగా పెట్టిన ఆస్తి వివరాలు మరియు ఆన్‌లైన్‌లో సమర్పించబడే బిడ్ ఫారమ్ కోసం మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ అనగా ఎం/ఎస్ ఇన్వెన్టన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఇన్వెన్టన్) వెబ్‌సైట్ https://auctions.inventon.in ద్వారా వెళ్ళవచ్చు. (2) [illegible]

తేదీ: 12/12/2023, ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ తరపున

LOSS OF PASSPORT
I, VEGINATI VENKATESWARLU, S/o. Veginati Kasaiah, R/o. Flat No.SF2, Garden Apartment, 5th Lane, Brundavan Gardens, Guntur, A.P. I lost my original Passport No.U9799039 on 08-12-2023 while I was travelling from the RTO office to the nearest xerox center. If anybody finds it, please inform me.
Cell: 97001 54515

డాక్యుమెంట్స్ పోయినవి
చిగురుపాటి హరికృష్ణ, తండ్రి శ్రీరామమూర్తి అను నేను ఘంటసాల మండలం, తాడేపల్లి గ్రామ నివాసిని. గృహ రుణం నిమిత్తం నా స్థలం పత్రాల నెంబర్ 2828/2010 తాడేపల్లి నుండి విజయవాడకు బస్సులో వెళ్ళటం జరిగింది. రుణం నిమిత్తం కార్యాలయంలో స్థలం పత్రాలు ఇద్దామని బ్యాగ్‌లో చూడగా స్థలం పత్రాలు లేవు. మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినవి. నా స్థలం పత్రాలు నాకు ఎంతో అవసరమై ఉన్నవి. కావున దయవుంచి నా స్థలం పత్రాలు దొరకిన వారు వెంటనే నా నెంబర్ 9985246200 కు ఫోన్ చేయగలరు.
చిగురుపాటి హరికృష్ణ, 9985246200

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన

విశాలాంధ్ర-దుర్గి: మండలంలో ఈనెల 14వ తేదీ నుంచి జరగబోయే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర షెడ్యూల్ గురించి ఇన్చార్జి ఎంపీడీవో జీఎల్ఎన్ గుప్తా పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో వివిధ కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి మండలంలో ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలు సందర్భంగా ప్లేయర్స్, ఆడియన్స్ గురించి చర్చించారు. పేర్ల నమోదుకు ఈనెల 13 ఆఖరి తేదీ కాబట్టి ప్రతి సచివాలయంలో వందశాతం రిజిస్ట్రేషన్లు జరగాలన్నారు. అనంతరం ఏపీ నీడ్స్ జగనన్న కార్యక్రమంపై రివ్యూ చేశారు. కార్యక్రమంలో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్-5 సెక్రటరీలు పాల్గొన్నారు.

నేటి నుంచి పల్నాటి ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-కారంపూడి: ఎంతో ఘన చరిత్ర కలిగిన పల్నాటి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కాను న్నాయి. ఆనాడు పల్నాటి యుద్ధంలో ప్రధాన భూమిక పోషించిన ఐదు ఘట్టాలైన రాచగావు, రాయభారం, మందపోరు, కోడిపోరు, కల్లిపాడును వరుసగా ఐదు రోజులుగా పల్నాటి ఉత్సవాలను నిర్వ హిస్తారు. దేవాదాయశాఖ, పంచాయతీశాఖ, మండలపరిషత్, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వారు తెలిపారు. ఉత్సవాలలో ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేయనున్న స్టాల్స్ కొరకు స్థలాన్ని సోమవారం ఎంపిడివో జి.శ్రీనివాసరెడ్డి, గ్రామ కార్యదర్శి కసిన్యానాయక్ కేటాయించారు.

ఓటమి భయంతోనే టీడీపీ ఓట్ల తొలగింపు

విశాలాంధ్ర-నూజెండ్ల: ఓటమి భయంతో వైసిపి నాయకులు గ్రామాలలో టిడిపి సానుభూతి పరుల ఓట్లను తొలగిస్తున్నారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు విమర్శించారు. మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో అక్రమ ఓట్ల తొలగింపుపై తాహసిల్దార్ కి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో అక్రమంగా టిడిపి సానుభూతిపరుల ఓట్లను తొలగించేందుకు ఫారం7తో వైసిపి నాయకులు దరఖాస్తు చేశారని ఇది దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈకార్యక్రమంలో జనసేన మండలం పార్టీ ఉపాధ్యక్షులు పసుపులేటి రజి బాబు, గ్రామ నాయకులు అరిగెల కుమార్, తిరుమల శెట్టి నవీన్ , రఘుపతి వీరాంజి, యద్దనపూడి సత్యనారాయణ, మేదరమెట్ల వేణు, మన్యం సామేలు, ఏబేలు, ఏలేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర-శావల్యాపురం: రోడ్డు దాటుతున్న వ్యక్తిని ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలైన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై మండలంలోని కనమర్లపూడి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కనమర్లపూడి గ్రామానికి చెందిన ఓర్సు ముసలయ్య జాతీయ రహదారిని దాటుతుండగా ద్విచక్రవాహనంపై నర్సరావుపేటకు వెళుతున్న నూజండ్ల మండలం యేగిరెడ్డిపాలేనికి చెందిన ఎంవీ కరుణాకరరెడ్డి వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరూ రోడ్డుపై పడి కొంతదూరం ఈడ్చుకొంటూ వెళ్ళారు. ముసలయ్య తలకు తీవ్రగాయమవ్వగా స్థానికులు ఆటోలో వినుకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ముసలయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కరుణాకరరెడ్డికి మెడ క్రింద భాగంలో గాయమవ్వడంతో వినుకొండలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చదువుతోనే బాలికలకు ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర-రెంటచింతల: చదువులతోనే బాలికలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ హైకోర్టు సీనియర్ సూపరిండెంట్ పి.వి.వి అంజని కుమారి అన్నారు. సోమవారం స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. పదిలో 550 మార్కులు సాధించిన ప్రతి ఒక్కరికి రూ 5 వేలు చొప్పున ప్రోత్సాహకాలు కలాం విజన్-యువతేజం సేవాసంస్థ ఆధ్వర్యంలో అందజేస్తామన్నారు. ఇటీవల జరిగిన పరీక్షలలో ప్రతిభ చూపిన 8 మందికి, చలికోటు, ప్రశంసా పత్రాలు అందజేశారు. సదస్సులో కరీ ముల్లా, నారాయణస్వామి, అనిల్, బేగ్, అరుణకుమారి పాల్గొన్నారు.

17న మండలస్థాయి పరీక్ష పోటీలు

విశాలాంధ్ర-శావల్యాపురం: జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో శావల్యాపురంలోని శ్రీరామ పబ్లిక్ స్కూల్ నందు మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్షా పోటీలను ఈనెల 17వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి కేవీఆర్ మోహన్ చంద్ సోమవారం తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3వ తరగతి నుండి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రతిభా పరీక్షల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 14వ తేదిలోపు పాఠశాలలో పేర్లు నమోదు చేసుకొని హాల్ టికెట్లు పొందవచ్చన్నారు. ప్రిన్సిపాల్ రత్నకుమారి, డైరెక్టర్ అజిత్ చంద్ ఉన్నారు.

దిగుబడుల అంచనాకే పంట కోత ప్రయోగాలు

విశాలాంధ్ర-శావల్యాపురం: పంట దిగుబడులను అంచనా వేసేందుకు పంటకోత ప్రయోగాలు ఎంతగానో దోహదపడతాయని మండల వ్యవసాయ అధికారి పల్లపోతు ప్రవీణ్ అన్నారు. మండలంలోని కొత్తలూరు రెవిన్యూ పరిధిలోని గుర్రంవారిపాలెం గ్రామంలో వరి పంటకోత ప్రయోగాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో పూరేటి అశోక, ఇన్సూరెన్స్ ఏజెంట్ శ్రీనివాసరావు, ఎంపీఈవో శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

యువగళంలో పాల్గొన్న డాక్టర్ శ్రీనివాస్

విశాలాంధ్ర-గురజాల : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తుని నియోజకవర్గంలో కొనసాగుతున్న టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 3వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు ప్రముఖ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ సోమవారం నారా లోకేష్‌ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శ్రీనివాస్ పాదయాత్రలో లోకేష్‌తో పాల్గొని నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

14న కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-నరసరావుపేట : రాష్ట్రంలోని రైతాంగ సమస్యలపై మిచౌంగ్ తుఫాను వలన నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష రాజకీయ పార్టీల ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు విజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సీపీఎం రైతు సంఘం నాయకులు రామారావు, టీడీపీ రైతు సంఘం నాయకులు గూడూరి శేఖర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు ఉలవలపూడి రాము, తాళ్లూరి బాబురావు, జనసేన పార్టీ అధికార ప్రతినిధి అద్రూఫ్, కాంగ్రెస్ నాయకులు ఎస్ఎం భాషా, ఎంఐఎం నాయకులు మస్తాన్‌వలి, జై భీమ్ భారత్ పార్టీ నాయకులు జాన్ పాల్, పీడీఎఫ్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ నాయకులు షేక్ సుభాని, గిరిజన సంఘ నాయకులు కోట నాయక్, శ్రీను నాయక్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు బి.శ్రీనివాస్, బి.వెంకటేశ్వర్లు తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొని మాట్లాడి డిసెంబర్ 14వ తేదీ కలెక్టర్ కార్యాలయం వద్ద తుఫాన్ బాధిత రైతుల సమస్యలపై జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

వైసీపీ పాలనలోనే అన్ని వర్గాలకు సంక్షేమ లబ్ధి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-వినుకొండ: వైసీపీ పాలనలోనే ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీలకు పూర్తి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. సోమవారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పేద వర్గాలకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందుతున్నప్పటికీ టీడీపీ వారు కళ్ళు లేని కబోదిలాగా మాట్లాడుతున్నారని విమర్శించారు. గ్రామాలలో ఆర్బికే కేంద్రాలు, హెల్త్ సెంటర్లు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉన్నాయని అన్నారు. అలాగే తుఫాను బాధిత రైతులకు పూర్తి న్యాయం చేస్తున్నామన్నారు. పంట నష్టపోయిన రైతులకు నేరుగా నష్టపరిహారం బ్యాంకు ఖాతాలో పడుతున్నదని ఈ సందర్భంగా అన్నారు. తుఫాను వచ్చిన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి హెలికాప్టర్లో తిరుగుతున్నాడని చంద్రబాబు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు హయాంలో తుఫాను ప్రాంతాల్లో హెలికాప్టర్లో తిరగలేదా అని ప్రశ్నించారు. మూడు నెలల్లో టిడిపి అధికారంలోకి వస్తుంది మీ భరతం పడతాం అంటూ టిడిపి వర్గాలు బెదిరిస్తున్నాయని అన్నారు. గెలుపు ఓటములు ప్రజలే నిర్ణయిస్తారన్నారు. నియోజకవర్గంలో టిడిపి ఓట్లు డబల్ ఎంట్రీలు ఉన్నాయని. అధికారులు తొలగిస్తుంటే టిడిపి వారు ధర్నాలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. టిడిపి వారు ప్రకాశం జిల్లా పేదలను రప్పించి నూజెండ్ల మండలంలో వారికి గుడిసెలు వేయించి ఓట్లు చేర్పిస్తున్నా రని ఎమ్మెల్యే విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల 40వేల కోట్లు పేదల సంక్షేమానికి ఖర్చు పెట్టిందని అన్నారు. ఈ సమావేశంలో జడ్పిటిసి స్వేనొం, గోవింద నాయక్ , టి కోటేశ్వర రావు పాల్గొన్నారు.

తుపాన్‌తో మిర్చి పంటకు తీవ్ర నష్టం

విశాలాంధ్ర-వెల్దుర్తి: వాణిజ్య పంటలకు పెట్టింది పేరు పల్నాడు ప్రాంతం. ఈ ప్రాంతంలో ఎక్కువగా పత్తి మిరప పంటలను సాగు చేయడం రైతులకు ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది పత్తి పంట రైతులను నట్టేట ముంచింది. సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో తీవ్ర నష్టాలకు గురయ్యారు.అయితే ఇక్కడ రైతులు వెంటనే నర్సరీల నుండి మిరప మొక్కలను కొనుగోలు చేసి బోరుబావుల ఆధారంగా సాగు చేపట్టారు. ఇటీవల వరకు ఆశాజనకంగా ఉన్న మిరపపైరు మిచౌంగ్ తుఫాన్ వలన రైతుల పాలిట శాపంగా మారింది. వర్షపాతం ఎక్కువ కావడంతో పొలాలలో నీరు చేరి మొక్కలు చచ్చుబడి పోయి పంట నష్టం ఎక్కువగా జరిగింది. ఈ ప్రాంతంలో రైతులు కర్ణాటక బాడిగా, డబ్బి బ్రాడి, ర్యాలీస్ బ్రాడి, తేజ రకాలను ఎక్కువగా పండిస్తారు. మార్కెట్లో కూడా వీటికి ధర ఎక్కువగా పలుకుతుంది. అందువల్ల పెట్టుబడి ఎక్కువైనా ఈ రకాలని సాగు చేయడానికి మొగ్గు చూపుతారు. ఇప్పటికే పెట్టుబడులు అధికంగా పెట్టి పంట చేతికి వస్తుంది అనుకున్న తరుణంలో ఈ తుఫాను పులి మీద పుట్రలా రైతులను ఆర్థికంగా దెబ్బతీసింది. వాతావరణ శాఖ ఈనెల 18వ తేదీన మరొక తుఫాను హెచ్చరికలు చేయడంతో అక్కడక్కడ బాగున్న మిర్చి పైరు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి తాము నమ్ముకున్న భూమి తల్లి న్యాయం చేస్తుందని కొండంత ఆశతో బ్రతికే కష్టజీవికి ప్రతి ఏటా కన్నీరే మిగులుతోంది. ప్రభుత్వం రైతుల పరిస్థితిని గమనించి తుఫాను వల్ల నష్టపోయిన రైతాంగానికి పరిహారాన్ని ప్రకటించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది..

ప్రజలే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : గ్రామీణ ప్రాంతాలలో రహదారుల మరమ్మతు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టిన సంఘటన వినుకొండ మండల పరిధిలోని ఉమ్మడివరం గ్రామంలో జరుగుతుంది. వినుకొండ పట్టణం నుండి మండల పరిధిలోని ఏనుగుపాలెం, పీట్టంబండ, ఉమ్మడివరం, హస్నా నాయుడుపాలెం, పెదకంచెర్ల, నాగులవరం తదితర గ్రామాల మీదుగా ప్రకాశం జిల్లా అద్దంకి వైపుకు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అమార్గం మరింత అధ్వానంగా మారింది. అయితే అధికార యంత్రాంగం రహదారి నిర్మాణ పనులలో పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అయినప్పటికీ పాలకులలో, అధికారులలో చలనం లేకపోవడంతో విసుకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా తామే రోడ్డు నిర్మాణ పనులను చేపట్టేందుకు ముందుకు వచ్చారు. ఉమ్మడివరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన గ్రామ సర్పంచ్ వీరగంధం ఆనంద్ సారథ్యంలో గ్రామస్తులు ముందుకొచ్చి చైతన్యంతో నిర్మాణ పనులను ప్రారంభించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి: సీపీఐ

విశాలాంధ్ర-గురజాల : రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సీపీఐ గురజాల నియోజకవర్గం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీఓ ఆఫీస్ ఎదురుగా సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు షేక్ హుస్సేన్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీల ప్రకారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తక్షణమే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితులు ఎవరు కూడా ప్రభుత్వ సొమ్ము కోరుకోవడం లేదని, అగ్రిగోల్డ్ యజమానుల ఆస్తులను జప్తు చేసి ఆ డబ్బులను తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని హుస్సేన్ తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణమే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని లేని పక్షంలో టిడిపి పార్టీకి పట్టిన గతే 2024లో వైసీపీకి పడుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ గురజాల నియోజకవర్గ ఏరియా కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, సీపీఐ పార్టీ నాయకులు మేకపోతులు శ్రీనివాస్ రెడ్డి అన్నపురెడ్డి పిచ్చయ్య, అగ్రిగోల్డ్ ఏజెంట్ అసోసియేషన్ సభ్యులు వందనం మల్లికార్జునరావు, బండి నాగరాజు, ఆంధ్ర కృష్ణ, పివి శివరావు, నేషనల్ నవక్రాంతి పార్టీ వ్యవస్థాపకుడు కనకం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో మిచౌంగ్ తుఫానుతో రైతుకు తీవ్ర నష్టం

విశాలాంధ్ర-గుంటూరు : ఏపీలో ఇటీవల సంభవించిన మిచౌంగ్ తుఫాను రైతుకు కన్నీటిని మిగిల్చిందని, దాదాపు 8 జిల్లాల్లో 20 లక్షల ఎకరాల పంట నీట మునిగి పూర్తిగా దెబ్బతిందని, దాదాపు రూ.5 నుంచి రూ.6 వేల కోట్ల నష్టం వాటిల్లిందని వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం పార్లమెంట్‌లో ప్రస్తావించారు. ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్టం వాటిల్లిందని.. ఈ సమయంలో ఏపీకి విపత్తు నిధులను అదనంగా కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సామాజిక పెన్షన్లు పెంపుదల చేయాలి

విశాలాంధ్ర-ఈపూరు : పెరిగిన ధరలకు అనుగుణంగా సామాజిక పెన్షన్లను పెంపుదల చేయాలని, వృద్ధాప్యంలో జీవనం కొనసాగిస్తున్న వృద్ధులకు, వితంతువులకు, కళాకారులకు, చేతి వృత్తి వారికి, దివ్యాంగులకు పెన్షన్లను పెంచాలని సీపీఐ సీనియర్ నాయకులు ఊట్ల రామారావు, సత్యానందం, సూరే అప్పారావులు పెన్షనర్లతో కలిసి మండల కేంద్రమైన ఈపూరు, మండలంలోని ముప్పాళ్ళ గ్రామ సచివాలయాల వద్ద సోమవారం నిరసన తెలియజేసి సెక్రెటరీకి పెంపుదల వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వయోవృద్ధులు తమ యావత్తు జీవిత కాలాన్ని కుటుంబ కోసం, సంపదసృష్టి కోసం, సమాజ అభివృద్ధి కోసం కృషి చేసిన వృద్ధులకు రూ.2,750 నుంచి రూ.6వేలు పెంచాలని, అర్హత కలిగిన భార్యా భర్తలకు ఇరువురుకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. పెన్షన్ తీసుకోవడానికి అర్హత వయస్సు యాబదిసంవత్సరాలు నిర్ధారించాలని, విభిన్న ప్రతిభావంతులు లేక వికలాంగులకు సామాజిక పెన్షన్లను రూ.3వేలు నుండి రూ.7వేలుకు పెంచాలన్నారు. తల్లిదండ్రుల పోషణ, వృద్ధుల సంరక్షణ చట్టం 2007 సక్రమంగా అమలు చేసి వారికి తగు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొప్పెర పరమేష్, సామాజిక పెన్షన్‌దారులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం ఆచరణీయం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రొంపిచర్ల : ఏసుక్రీస్తు చూపిన మార్గము ఆచరణీయమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక బీసీ కాలనీలో గల ఎస్‌డిఏ చర్చిలో సోమవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీనివాస రెడ్డికి పాస్టర్స్ ఘనంగా స్వాగతం పలికారు. చర్చిలో జరిగిన సెమీక్రిస్మస్ వేడుకలలో సెమీక్రిస్మస్ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు మానవులందరూ ఒక్కరిపై ఒకరు ప్రేమ, దయ, కరుణ కలిగియుండాలని బోధించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కోటప్పకొండ సంరక్ష సొసైటీ జనరల్ సెక్రటరీ డాక్టర్ బీఆర్ సుశీల్ కుమార్, పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడు పి.జీవానందం, మాజీ అధ్యక్షుడు ఎం.ప్రభుదాస్, గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, వైసీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు చపారపు గోపాలరెడ్డి, మండల నాయకులు గుండాల వెంకటేష్, పాస్టర్స్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : మున్సిపల్ రంగంలో పని చేస్తున్న అన్ని తరగతుల కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసే వరకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు రూ 26వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కోమరగిరి చెంచయ్య, కార్యదర్శి యోగయ్య డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ మునిసిపల్ కార్పొరేషన్, పంచాయతీలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, పర్మినెంట్, పారిశుద్ధ్య, ఇంజనీరింగ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కార్మికులు,స్కూల్ స్వీపర్లు, డ్రైవర్లు, టాయిలెట్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్త శుద్ధితో కృషి చేయాలన్నారు. సమస్యల సాధనకు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి, వైఎస్సార్ టియుసి, టిఎన్‌టియుసి స్వతంత్ర కార్మిక సంఘాలు కలిసి మున్సిపల్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి డిసెంబర్ 27వ తేదీ నుంచి సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. పర్మినెంట్ పారిశుద్ధ ఇంజనీరింగ్ కార్మికుల జిపిఎఫ్ ఖాతాలు సాంకేతిక సమస్యలు అంటూ ప్రభుత్వం వాయిదాలు వేయకుండా సత్వరం చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లు విధులలో మరణిస్తే రూ.30 లక్షలు, ప్రమాదం జరిగితే రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆవుల పోతురాజు, పెద్ద నాగేశ్వరరావు, జయరావు, తిరుపతిరావు, గంగాధర్, మార్తమ్మ, బాలస్వామి, యేసురత్నం, కొమ్మతోటి మేరీ, సోమీ బాయి, అంకమ్మ, పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడుల్లో 66.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణ చేస్తున్న వాహనాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారంతో సోమవారం తెల్లవారు జామున మండలంలోని గంగన్నపాలెం గ్రామ శివార్లలో రేషన్ బియ్యంతో ఉన్న అశోక్ లైలాండ్ లారీని సోదా చేశారు. ఇందులో మార్చకుండా 112 బస్తాల్లో రేషన్ బియ్యంతో పాటు మరో 21 ప్లాస్టిక్ గోతాలలో ఉన్న బియ్యం 133 బస్తాల బియ్యాన్ని, లారీని స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్ యడ్లపాడుకు చెందిన ఇళవరపు నాగేశ్వరరావును అరెస్టు చేశారు. మొత్తం పట్టబడిన 66.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం విలువ రూ.2.32లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

14న ధర్నా జయప్రదం చేయండి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు : మిచౌంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతుకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 14వ తేదిన కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. ధర్నాలో జిల్లాలోని రైతులు, కౌలు రైతులు, అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని అఖిలపక్ష నేతలు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తుఫాను, కరువులతో అల్లాడుతున్న రైతులు, గ్రామీణ పేదలు-రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, సీపీఎం జిల్లా నాయకులు కంచుమాటి అజయ్ కుమార్, జనతాదళ్ నాయకులు సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రిలు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితోనే మిచౌంగ్ తుఫాన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని అన్నారు. తుఫాన్ వివిధ రకాల పంటలను సర్వనాశనం చేసిందని, దీంతో రైతు తీవ్రంగా నష్టపోయాడని అన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి చేతికొచ్చిన పంట నీట మునిగి రైతు అలమటిస్తుంటే ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందని విమర్శించారు. పంట కోల్పోయిన ప్రతి రైతును ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. పంట నష్టపోయిన వారిలో కౌలు రైతులు అధిక శాతం మంది ఉన్నారని, వారిని కూడా ప్రభుత్వం ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. తెచ్చిన అప్పు ఎలా తీర్చాలో తెలియక ఇప్పటికే పలువురు రైతులు, కౌలు రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, ఇవి ఇంకా పెరుగకముందే ప్రభుత్వం స్పందించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనేక సంక్షేమ పథకాలకు బటన్ నొక్కుతున్న ముఖ్యమంత్రి అన్నం పెట్టే రైతన్నను ఆదుకునేలా ఒక్కసారి బటన్ నొక్కాలని, లేనిపక్షంలో రైతాంగం ఏకమై ఒకేసారి బటన్ నొక్కి జగన్‌ను ఇంటికి పంపుతారని హెచ్చరించారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తుంగా బాలస్వామి, ఇష్టా జాతీయ కార్యదర్శి షేక్ గని, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు, ముఠా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గుర్రంకొండ సత్యానందం, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతిరెడ్డి లక్ష్మారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి బండారపు యశ్వంత్ శశి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు షేక్ కరీం, సీపీఐ సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం పలు తీర్మానాలను సమావేశం ఆమోదించింది.

సామాజిక పెన్షన్లు పెంచి ఇవ్వాలి

విశాలాంధ్ర-వినుకొండ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సామాజిక పెన్షన్లు ప్రజలకు చాలీచాలని సమస్యగా మారిందని కనుక పెన్షన్లను పెంపుదల చేసి పంపిణీ చేయాలని సీపీఐ వినుకొండ నియోజకవర్గం కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామాజిక పెన్షన్ల పెంపుదల కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ పిలుపుమేరకు పెన్షన్‌దారులను చైతన్యపరుస్తూ సచివాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సోమవారం వినుకొండ మండలంలోని బ్రాహ్మణపల్లిలో పెన్షన్ దారులతో కలిసి బూదాల శ్రీనివాసరావు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వృద్ధులు, వికలాంగులు, వితంతు మహిళలు తదితరులకు ఇస్తున్న పెన్షన్లు వారి కనీస అవసరాలకు చాలటం లేదని వృద్ధాప్య దశలో వారిని ఆదుకోవడం పాలకుల ధర్మమని తెలిపారు. రూ.2750లను 6వేలకు వికలాంగుల పెన్షన్ 3వేల నుంచి ఏడు వేల రూపాయల వరకు పెంచి ఇవ్వాలని బ్రాహ్మణపల్లి సచివాలయంలో పెన్షన్లదారులతో కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వినుకొండ నియోజక వర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, ఈపూరు మండల కార్యదర్శి ఓట్ల రామారావు, ఈపూరి కార్యదర్శి సత్యానందం, అప్పారావు, పరమేశు, ఏఐవైఎఫ్ నాయకులు కుంచాల అఖిల్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పులి శశి కుమార్, సిపిఐ నాయకులు కొప్పరపు మల్లికార్జున, నల్లబోతుల శ్రీను, దారా సాంబయ్య, భాస్కర్ లబ్ధిదారులు పాల్గొన్నారు

విశాలాంధ్ర-బొల్లాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.2750 లను రూ.6వేలకు మరియు వికలాంగులకు రూ.మూడు వేల నుంచి ఏడు వేల వరకు పెంచి పంపిణీ చేయాలని సీపీఐ బొల్లాపల్లి మండల కార్యదర్శి పిన్నబోయిన వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బొల్లాపల్లి మండలంలోని పేరూరిపాడు గ్రామంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అర్జీ దారులతో కలిసి సచివాలయంలో వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో విపరీతంగా పెరిగిన నిత్యవసర సరుకులు ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వీటితోపాటు అనేక రకాల పనులు వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పెన్షన్లు లబ్ధిదారులకు ఏమాత్రం సరిపోవటం లేదని, వృద్ధాప్యం పైబడి అనేక రోగాల బారిన పడుతున్న వృద్ధులకు కష్టతరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, కే.రమణమ్మ, కే. శేషమ్మ, షేక్ మస్తాన్, కే.వెంకటేశ్వర్లు, నాసరయ్య, షేక్ వలి, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-వినుకొండ: పెరిగిన ధరలకు అనుగుణంగా సామాజిక పెన్షన్ మరియు వృద్ధాప్యం వితంతు ఒంటరి మహిళ పెన్షన్లు పెంచాలని సోమవారం ఒకటో వార్డు ప్రజలతో తల్లి పిల్లల హాస్పిటల్ ఎదురుగా ఉన్నటువంటి ఒకటో వార్డు సచివాలయం ముందు సామాజిక పెన్షన్ దారులతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నాయకులు కుంచాల అఖిల్ మాట్లాడుతూ నేటి ధరలకు అనుగుణంగా వృద్ధులు మంచికి మంచిగా ఒక్క పూట టిఫిన్ చేసి టీ తాగి మెడిసిన్ వేసుకోవాలి అంటే ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ ఏమాత్రం సరిపోవటం లేదని నేటి ధరలకు అనుగుణంగా పెంచాలన్నారు.ఈ కార్యక్రమంలో పులి శశికుమార్ కొప్పరపు మల్లికార్జున నల్లబోతుల శ్రీనివాసరావు గాదం రామయ్య ఇంకా ఒకటో వార్డులోని వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఐబీఎం నిబంధనలు పాటిస్తున్న కేసీపీ అధికారులు

విశాలాంధ్ర-మాచర్ల : గనుల పర్యావరణం ఖనిజ సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఐబీఎం టీం కన్వెనర్ కె.రామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కేసీపీ ప్లాంటును సందర్శించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ మొక్కల పెంపకం, పరిసరాల శుభ్రత, ఉద్యోగుల సంక్షేమం వారి భద్రత విషయాలలో ఐబీఎం మార్గదర్శ కాలను మాచర్ల ప్లాంటులో నూరు శాతం పాటిస్తున్నట్టు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ ప్లాంట్ అధికారులను అభినందించారు. అనంతరం ప్లాంట్ సీనియర్ జనరల్ మేనేజర్ పి.వెంకటరమణ మాట్లాడుతూ ప్రోడక్ట్ నాణ్యతతో పాటు కార్మికులు, ఉద్యోగ సిబ్బంది సంరక్షణకు కట్టుబడి ఉన్నామన్నారు. ప్రతి ఏటా కేసీపీ సీఎండి జన్మదినం నాడు, ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు వందల మొక్కలను తమ ఆధ్వర్యంలో నాటుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా ప్లాంట్ తరఫున పట్టణం, పరిసరాలలోని పలు గ్రామాలలో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఐబీఎం టీం సభ్యులు తమ ప్లాంటును సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేయడం సంతోషకరమన్నారు. అనంతరం వారి ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో వి.వెంకటరమణ, ఎస్.ప్రసాద్, డీజీఎం మైన్స్ కె.రామకోటేశ్వరరావు, వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-వినుకొండ: టీడీపీ కార్యాలయంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు చేతులు మీదగా సోమవారం టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థి మేలుకో భవిష్యత్తు కాపాడుకో అనే పోస్టర్‌ను విడుదల చేశారు. జీవి ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు జగన్ రెడ్డి ఇచ్చిన హామీల అమలులో జరిగిన అన్యాయంపై చైతన్యం తీసుకురావాలని టిఎన్ఎస్ ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. పాఠశాలలను ప్రయోగశాలలుగా మార్చి విద్యార్థుల జీవితాలతో చెలగాటలాడుతున్నారడని ఆవేదన వ్యక్తం చెశారు.విశ్వ విద్యాలయాలను వైసీపీ కార్యాలయాలుగా మార్చేశారని మనబడి,నాడు నేడు,విద్యా కానుక, బై జ్యూస్ వంటి పథకాలను అడ్డంపెట్టుకుని దోచుకుంటున్నారని, పీజీ విద్యార్థులకు ఫీజు రీయిబర్స్‌మెంట్స్ రద్దు చేశారని మండిపడ్డారు. విద్యార్థి లోకానికి జగన్ రెడ్డి చేసిన మోసాలపై అనేక అవగాహన, ర్యాలీలు, సదస్సులు, సమావేశాలు నిర్వహించి విద్యార్థులందరినీ ఏకతాటిపై తీసుకురావాలన్నారు. ప్రత్యేక హోదా అంటూ విద్యార్థులను రెచ్చగొట్టి తీరా అధికారంలోకి వచ్చాక మాట తప్పి మడమ తిప్పారని, రాబోయే రోజుల్లో జగన్ రెడ్డిని ఇంటికి పంపించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పల్నాడు జిల్లా టి.ఎన్.ఎస్.ఎఫ్ అధ్యక్షులు కూరపాటి హనుమంతరావు నియోజకవర్గం టి.ఎన్.ఎస్.ఎఫ్ అధ్యక్షుడు నక్రా కిషోర్ పార్లమెంట్ అధికార ప్రతినిధి వీరంగం ప్రశాంత్ నియోజవర్గం సెక్రటరీ ఎస్. కె.అబ్దుల్లా నరసరావుపేట టి.ఎన్.ఎస్.ఎఫ్ అధ్యక్షుడు సాయి భార్గవ్ మరియు బ్రహ్మానాయుడు, లక్ష్మణ్, అబ్దుల్, సౌరి బాబు మరియు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-గుంటూరు : స్పందన కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి, సివిల్ కేసులకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

భూహక్కు యాజమాన్య చట్టం రద్దు చేయాలి

విశాలాంధ్ర-పర్చూరు: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూహక్కు యాజమాన్య చట్టం రద్దుచేయాలని కోరు తూ స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన చేపట్టారు. సంఘం అధ్యక్షులు కొల్లా నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజల ప్రయోజనాలకు హానికరంగా, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఉన్న చట్టంను రద్దుచేయాలని తెలి పారు. నూతన చట్టంపై ప్రజలకు అవగాహనకు గ్రామాలలో కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలను జాగృతం చేస్తామని, ఈనెల 15 వరకు విధులను బహిష్కరించామని తెలిపారు. నిరసనలో న్యాయవా దులు చాగంటి సుబ్బారావు, రావి శ్రీనివాసరావు, పోతిని సురేంద్ర, రావి రమేష్‌బాబు, తులసి రాజేష్, రమణి, ధనలక్ష్మి, రేష్మ ఉన్నారు.

ఫెలోషిప్ నూతన కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - రేపల్లె : నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ నూతన కార్యాలయం ను ఐఆర్ఇఫ్ సంస్థ అధి నేత బిషప్ డాక్టర్ ఇమ్మనియేలు రెబ్బ ప్రారంభించారు. పట్టంలోని తాలూకా ఎదురు బాలాజీ టవర్స్ లో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిషప్ ఇమ్మానుయేల్ రెబ్బ మాట్లాడుతూ పాస్టర్ ల మధ్య స్నేహ సం బంధాలు మెరుగు పరిచేందుకు ఇదొక వేదిక అన్నారు. నియోజక వర్గంలోని పాస్టర్లు అందరూ ఆత్మీయంగా బలపడేందుకు కావలసిన శిక్షణ తరగతులు నిర్వహించటం తో పాటు సమస్యలు పరిష్కరించేం దుకు సమిష్టిగా సంఘం తరుపున కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాస్టర్ కొండేటివేంకటేశ్వరావు, పాస్టర్ శామ్యూల్, పాస్టర్ దినేష్, పాస్టర్ సంపత్ కుమార్, పాస్టర్ జాన్ బాబు పాస్టర్ ఇమ్మానుయేల్ పాస్టర్ షారోన్ పాస్టర్ సాల్మన్ పాల్గొన్నారు.

సూర్యలంక తీరంలో భక్తులకు అన్నదానం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : కార్తీక మాసం పురస్కరించు కొని మండల పరిధి లోని సూర్యలంక పర్యాటక కేంద్రం వద్ద కార్తీక మాసం సంద ర్భంగా ఆఖరి సోమవారం సూర్యలంక వస్తున్న భక్తులకి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని నల్లమోతు వారిపాలెం గ్రామ సర్పంచ్ మాదా సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా మాదా సుబ్రహ్మణ్యం మట్లాడుతూ సూర్యలంక సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు మూడు వారాలుగా సుమారు 35 వేల మందికి అన్నదానం చేశామన్నారు. ఒక వారం తుఫాను కారణంగా అన్న సంతర్పణ కార్యక్రమం చేయలేకపోయామని తుఫాను కారణంగా ఇబ్బంది పడుతున్న పేద ప్రజలకు నిత్యవసర వస్తువులు ఆర్థిక సహాయ సహకారాలు అందించామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోగ్యంగా ఉండాలని ఆయన కోసం రాబోయే రోజుల్లో మరిన్ని సేవ కార్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దొప్పలపూడి వెంకట అప్పారావు, మాజీ ఎంపీపీ మాదా వెంకటరత్నం, పమిడి భాస్కరరావు, మర్రి ఆశా చక్రవర్తి, నంగు ఏడుకొండల రెడ్డి, ఆట్ల మురళి కృష్ణ రెడ్డి, గ్రంది ఆంజినేయులు, దోకిన రామారావు తదిరులు పాల్గొన్నారు.

రెండు క్వింటాళ్ల అఖండ కర్పూర జ్యోతి

విశాలాంధ్ర - మార్టూరు : మండల కేంద్ర మైన మార్టూరులో జాతీయ రహదారి పక్కన వేంచేసి యున్న శ్రీ దుర్గా మల్లే శ్వర స్వామి దేవాలయం లో 14వ వార్షికోత్సవం, కార్తీక మాసం ముగింపు సందర్భంగా సోమ వారం సాయంత్రం 7 గంటలకు రెండు క్వింటాళ్ల కర్పూర అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు, మాజీ వైస్ చైర్మన్ షేక్ మహమ్మద్ బుడే శ్రీ విఘ్నేశ్వర కూరగాయల వర్తక సంఘం,దాతల సహకారంతో రెండు క్వింటాళ్ల కర్పూరం అఖండ జ్యోతి ప్రజ్వలన జరిగింది. అమ్మ వారికి ప్రత్యేక అలంకరణ చేశారు.మండలంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు భారీగా పాల్గొని జ్యోతి దర్శనం చేసుకున్నారు అనం తరం అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ,ప్రసాదాలు స్వీకరిం చారు వివిధ రకాల పూలతో శివలింగాకారం, దీపాలంకరణ, చేశారు.

వాకర్స్ అసోసియేషన్‌కు అవార్డు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రోటరీ ఆడిటోరియం నెల్లూరులో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 గవర్నర్ ఎం వెంకటాద్రి రెడ్డి ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్, అవార్డ్స్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాలలోని ఎస్ ఆర్ అండ్ పీ ఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా బెస్ట్ సర్వీస్ అవార్డును ప్రకటించి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణ, నారాయణమూర్తి, వంగర పూర్ణచంద్రరావు, చింతా రమేష్, రవి, సుబ్బారావు, సాంబశివరావు, తిరుపతిరావు, చెంగలరాయుడు, రామారావు, మాజీ గవర్నర్లు, వాకింగ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత పరీక్షలు, మందులు పంపిణీ

విశాలాంధ్ర - మార్టూరు : రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలోస్థానిక గవర్నమెంట్ జూనియర్ కళాశాల వద్దనున్న ఆర్. జె. ఎస్.టీ కాలనీ యందు గ్రామీణ వైద్యులు వీర్నపాటి శ్రీనివాసరావు పి.ఎం.పి గారి సహకారంతో మెడికల్ క్యాంపు నిర్వహించి రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారు ఉచిత మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తాళ్లూరి సాంబశివరావు మాట్లాడుతూ ఈ కాలనీ యందు ఎక్కువమంది జ్వరాలతో బాధపడుతున్నారని మా దృష్టికి వచ్చినందున ఇక్కడ అందరూ పేదలై ఉన్నందున కార్యక్రమం ఇక్కడ నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయాలన్న సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మద్దుమాల కోటేశ్వరరావు అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు కోశాధికారి చెరుకూరి నాగేశ్వరరావు ఫాస్ట్ ప్రెసిడెంట్స్ జాష్టి సాంబశివరావు, చెన్నుపాటి బసవరాములు, రొటేరియన్స్ మాదాల సాంబశివరావు, అలపర్తి శ్రీనివాసరావు, మోటుపల్లి అంకయ్య, కొర్రపాటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కాపులపై మోపిదేవి కపట ప్రేమ

విశాలాంధ్ర - రేపల్లె : కాపులపై ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని టీడీపీ జనసేన కాపు నేతలు విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు రామాంజనేయులు, జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ మాట్లాడుతూ ఇటీవల పట్టణంలో వైసీపీ కాపు నాయకులు ఏర్పాటు చేసిన వన సమారాధనలో మోపిదేవి వెంకటరమణ రావు చేసిన వ్యాఖ్యలు ఓట్ల రాజకీయంలో భాగమని ఆరోపించారు. కాపు సామాజిక వర్గానికి మేలు చేశానని మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. మోపిదేవి వెంకటరమణ నాయుడుగా కొనసాగుతానని మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. జనసేన టిడిపి పొత్తు కుదిరిన వెంటనే కాపు సామాజిక వర్గం గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. నిజాంపట్నం ఎంపీపీ కాపులకు ఇవ్వాల్సి ఉండగా తన కుటుంబ సభ్యులకి ఇవ్వటం కాపులను వంచించటం కాదా అన్నారు. టీడీపీ జనసేన కూటమితో ప్రభుత్వం మారుతుందని గ్రహించి ఓట్ల రాజకీయం కోసం హడావిడిగా వంగవీటి మోహన రంగా విగ్రహం ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కాపుయువతపై ఎస్ సి, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించాలేదా అని ప్రశ్నించారు. కాపు వన సమారాధనలో ఏర్పాటు చేసే ముందు రేపల్లె ప్రాంతంలో ఉన్న ప్రముఖ రాజకీయ నాయకులు రాజకీయ కాపు నేత అంబటి రాంబాబును ఆహ్వానించకపోవడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అన్నారు. 2004-2009 సంవత్సరాలలో మోపిదేవి అధికారంలో ఉన్నప్పుడు ఎందరో కాపు ఉద్యోగులను వేధింపులకు గురిచేసి జిల్లాలు దాటిన పోస్టింగులు ఇవ్వకుండా వేధించారని గుర్తు చేశారు. మోపిదేవికి కాపులపై చిత్తశుద్ధి ఉంటే కాపుకులంలోని నేతల రాజకీయ ఎదుగుదలకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ జనసేన నాయకులు పాల్గొన్నారు.

పాలకులు మారుతున్నా.. దళితుల రాతలు మారట్లేదు..

విశాలాంధ్ర - చీరాల : పాలకులు మారుతున్నారు కానీ మెజారిటీ ఓటర్లయిన దళితుల తలరాతలు మారట్లేదని ప్రజావేదిక రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి ఏసురత్నం అన్నారు. సోమవారం చీరాల గోలి సదాశివ కల్యాణ మండపంలో ప్రజా వేదిక రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి ఏసురత్నం అధ్యక్షత న దళిత మహాసభ,కేవీపీ ఎస్, ఐక్య క్రిస్టియన్ జేఏసీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో దళిత నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ చీరాలలో మెజారిటీ ఓటర్లు ఎస్సి,ఎస్టీ లేనని పాలకులు ప్రణాళిక బద్దంగా దళితుల ప్రాముఖ్యత తగ్గించారన్నారు. పాలకులు దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చి దళితులను అణచివేస్తున్నారని ఐక్యమత్యంగా ఉండి మన శక్తిని చూపించాలన్నారు. దళితుల ఐక్యమత్యం కోసం నియోజకవర్గంలో ఆడహక్ కమిటీలు ఏర్పాటు చేస్తామని,గ్రామానికి ఒక పది మంది చొప్పున పట్టణంలోని ప్రతి పేటలో ఈ కమిటీల ఆధ్వర్యంలోనే సమావేశాలు నిర్వహించి అంబేద్కర్ భావజాలాన్ని ప్రచారం చేస్తామన్నారు.దళితుల ఓట్లతో గెలిచి దళిత పేటల్లో కనీస సౌకర్యాలు కల్పించని పాలకులకు తగిన బుద్ధి చెబుదామని జాతి ఐక్యత కోసం పనిచేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సమాజ సేవకులు మోపర్తి జాన్,అమ్మ కంటి ఆసుపత్రి అధినేత డాక్టర్ అమృత పాణి, ఐక్య క్రిష్టియన్ జెఏసి బాపట్ల జిల్లా అధ్యక్షులు గుమ్మడి రత్న ప్రకాష్,బీఎస్పీ చీరాల నియోజకవర్గ ఇంఛార్జి గొర్రెపాటి రవి కుమార్,కెవిపి ఎస్ నాయకులు లింగం జయరాజ్,జనసేన నాయకులు గూడూరు శివరామ ప్రసాద్,ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు మోహన్ కుమార్ ధర్మ,దళిత మహా సభ నాయకులు సూకతోటి బాబురావు,దళిత నాయకులు జంగం జయపాల్,పాస్టర్ బిళ్ళ యోహాన్, దేవరపల్లి బాబురావు,కట్టా గంగయ్య,ముప్పంగి అరుణ్ కుమార్,ఎస్ జె.చిరంజీవి, పులిపాటి శేఖర్,పులిపాటి రవి,ఏరిచర్ల స్వామిదాసు, మోపర్తి నతానియెల్,డి అలెక్స్, పెద్ద సంఖ్యలో దళిత నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా చేయూత మహిళా మార్ట్

విశాలాంధ్ర - చీరాల : డ్వాక్రా గ్రూపుల ఆధ్వర్యంలో మహిళా స్వావలంబనే లక్ష్యంగా చీరాల వెలుగు ఏపిఎం సుబ్బారావు పర్యవేక్షణలో సీసీలు,విఓఏల సహకారంతో చీరాలలో చేయూత మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు.

చీరాలలో డ్వాక్రా సంఘాల సహకారంతో ఏర్పాటు చేసే మార్ట్‌లు ఏ మాత్రం విజయం సాధించలేవని పెదవి విరచిన వారు సైతం నాణ్యమైన వస్తువుల కొరకు మహిళ మార్ట్‌కు వెళ్తున్నారంటే అతిశయోక్తి కాదు. డ్వాక్రా సంఘాల సహకారంతో ఏర్పాటు చేసిన మార్ట్‌లో డ్వాక్రా మహిళలందరు 300లు రుసుము కట్టి సభ్యులుగా చేరారు. వంద రోజులలో కోటి రూపాయల రెవెన్యూ సాధించే లక్ష్యంతో ఏర్పడిన ఈ మహిళ మార్ట్ వెలుగు సిబ్బంది మొక్కవోని దీక్షతో విజయం సాధించి ఏ కార్పొరేట్ మార్ట్ కి తక్కువ కాదని నిరూపించింది. వెలుగు కార్యాలయం ఈ మార్ట్ ఏర్పాటు చేసాక 12మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఐదవ స్థానంలో నిలబడింది. ఈ మార్ట్ ఏర్పాటుకు మండల సమైఖ్య నిధి కింద పది లక్షల వరకులోను తీసుకొని మహిళ మార్ట్ ఏర్పాటు చేయవచ్చు కానీ వెలుగు ఏపీఎం సుబ్బారావు చొరవతో డ్వాక్రా మహిళ సంఘాలు సభ్యత్వం చేరడంతో ఆ నిధి అవసరం లేకుండా పోయింది.చీరాల శాసన సభ్యులు కరణం బలరామకృష్ణ మూర్తి,ఎమ్మెల్సీ పోతుల సునీతలు సైతం సాధారణ పౌరులలాగా ఈ మహిళా మార్ట్ లో నిత్యావసరాలు కొనుగోలు చేస్తుండడంతో నియోజకవర్గ ప్రజలు సైతం పట్టణానికి దూరంగా ఈపురుపాలెంలో ఉన్నప్పటికీ ఈ మహిళా మార్ట్ లో నిత్యావసరాలు కొనుగోలు చేసేందుకు వస్తున్నారు. ఈ మహిళ మార్ట్ లొ రోజుకు సుమరుగా లక్ష రూపాయల వరకు అమ్మకాలు జరుగుతున్నాయంటే ప్రజలు ఈ మార్ట్ ను ఎంతగా ఆదరిస్తున్నారు. మార్ట్ పర్యవేక్షణకు డ్వాక్రా సంఘాలు కొనుగోలు కమిటీ,పర్యవేక్షణ కమిటీ,ఫైనాన్స్ మేనేజ్మెంట్ కమిటీ,ఆడిటింగ్ కమిటీలుగా ఏర్పడి ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా నాణ్యతలో రాజీ పడకుండా నడిపిస్తున్నారు. ఈ మహిళ మార్ట్ భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెంది మరికొందరికి ఆదర్శంగా నిలుస్తుంది అనటంలో ఎటువంటి సందేహం లేదు.

పాఠశాలల సమగ్ర సమాచారాన్ని సరిగ్గా పూరించాలి



విశాలాంధ్ర - యద్దనపూడి : ప్రధానోపాధ్యాయులు పాఠశాలల సమగ్ర సమాచారాన్ని సక్రమంగా పూరించాలని ఎంఈఓ చెరుకూరి గోపి అన్నారు. విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూడైస్ లో పాఠశాలల , విద్యార్థుల , టీచర్ల ప సమాచారాన్ని 3 విభాగాలలో సంపూర్ణంగా ఎలా పూర్తి చేయాలనే విషయాన్ని ఈ సమావేశం లో విపులంగా చర్చించారు. ఈ సమాచారం ఎలా పూర్తి చేయాలనే దానిపై ప్రధానోపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రావి శ్రీనివాసరావు, దేవేంద్ర, మండలంలోని ఉన్నత పాఠశాలలు , ప్రాథమికోన్నత మరియు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తుపానుకు దెబ్బతిన్న పంట పొలాల నమోదు

విశాలాంధ్ర - వేమూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు మిచాంగ్ తుఫాను కారణంగా దెబ్బతిన్న వరి పంట పొలాలను సోమవారం నుండి డిసెంబర్ 18వ తేదీ వరకు పరిశీలించి నమోదు చేసుకోవడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి సిహెచ్ సునీత తెలియజేశారు.ప్రభుత్వాదేశాల మేరకు, వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఆర్వోలు, గ్రామాల్లో పర్యటించి నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి రైతు జాబితా తయారు చేయడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించి ప్రభుత్వం నిబంధనలు రూపొందించిందని దానికి అనుగుణంగా రైతులందరూ, రైతు భరోసా కేంద్రాల్లో, వీఆర్వోలను సంప్రదించి తమ పంట పొలాలు చూపించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె తెలియజేశారు.

పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులర్ చేయండి

విశాలాంధ్ర - చీరాల : పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులర్ చేసి, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం అందజేయాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కోటి దాసు అన్నారు. చీరాల మున్సిపల్ కార్యాలయం వద్ద రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ పలువురు నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టకు ముందు అధికారంలోకి వస్తే పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని,నేడు అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన కార్మికుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పట్టణాలను గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులు నిత్యం శ్రమిస్తారని అన్నారు. కార్మికులకు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోటి దాసు, మాల్యాద్రి, ఏబు, మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక మాస పూజలు

విశాలాంధ్ర - యద్దనపూడి : కార్తీక మాసం చివరి సోమ వారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని యద్దనపూడి రామలింగేశ్వర స్వామి, గన్నవరం కాశీ విశ్వేశ్వర స్వామి, పూనూరు త్రిపురాంతక స్వామి ఆలయం చింతపల్లిపాడు చెన్నకేశ్వర స్వామి, అనంతవరం ఇంజనంపాడు, చిలుకూరి వారి పాలెం తదితర గ్రామాలలో భక్తులు వేకువ జామున చన్నీటి స్నానాలను ఆచరించి ఆలయాలకు చేరుకొని భక్తి శ్రద్ధలతో కార్తీకదీపం వెలిగించారు, శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు .గ్రామాల్లో మహిళలు సముద్ర స్థానానికి తరలివెళ్లారు.ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

యానాది కుటుంబాలకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - బాపట్ల : గత రెండు రోజుల క్రితం టీడీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల పర్యటనలో తుఫాన్ భాదితులకు ప్రకటించిన ఆర్థిక సాయాన్ని పార్టీ కార్యాల యంలో టీడీపీ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ 47 కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ మీచౌంగ్ తుఫాన్ బారిన పడి నిరాశ్రయులైన పట్టణంలోని 3వ వార్డు రాజీవ్ నగర్ కాలనీకి సంబందిచిన 47 యానాదుల కుటుంబాలకి చంద్రబాబు నాయుడు ఒక్కొక్క కుటుంబానికి రూ. 5 వేలు 5000 ఆర్థిక సహాయాన్ని ప్రకటించిన వెంటనే ఆర్థిక సాయం అందజేశారు. తుఫాన్ వలన రాష్ట్రం చాల నష్ట పోయిందని విపత్తుని వెంటనే జాతీయ విపత్తుగా పరిగణించి తుఫాన్ బాధితులని ఆదుకోవాలని చంద్రబాబు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారన్నారు. 2024 లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్ టు రిచ్ పథకాని పైలట్ ప్రాజెక్‌గా ఇక్కడ నుండే మొదలు పెడదాం అని, వీరి అందరికి పక్కా ఇల్లు కట్టించి రోడ్లు కూడా వేసి వారికి నివేసన పట్టాలను ఇద్దామని చంద్రబాబు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు,పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

18 లోపు ముంపు పంట నమోదుకు అవకాశం

విశాలాంధ్ర - కర్లపాలెం : తుఫాను దాటికి ముంపుకు గురైన పంటలను ఈ నెల 18వ తేదీలోపు నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎమ్. సుమంత్‌కుమార్ తెలిపారు. మండలంలోని వ్యవసాయాధికారులు, రెవిన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేసి వివరాలను నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. ఎవరైన పోలాలు నమోదు చేయకుంటే సిబ్బందిని సంప్రదించాలని కోరారు. పోలం పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఎకౌంట్, ఫోన్‌నెంబర్‌లతో సంప్రదించాలన్నారు.

స్పందన ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

విశాలాంధ్ర - బాపట్ల : స్పందన ఫిర్యాదులపై సత్వరం స్పందించి భాదితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందన ఫిర్యాదులపై ఎస్పీ సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదులపై తక్షణ విచారణ చేపట్టి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని, స్పందన ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంకు మొత్తం 60 ఫిర్యాదులు వచ్చాయి.ఈ స్పందన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్ , స్పందన సెల్ ఇన్స్పెక్టర్ మాలకొండయ్య ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమడ ప్రాంత రైతుల గోడూ విన్నండి సారూ..

విశాలాంధ్ర - బాపట్ల : మిచౌంగ్ తుఫాను దాటికి నల్లమడ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆదుకోవాలని ఆ ప్రాంత రైతులు కలెక్టర్ రంజిత్‌బాషాకు లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేశారు. చెరుకూరు భూషాయపాలెం, గొల్లపూడి, రమణాయపాలెం, క్రొత్తపాలెం గ్రామాల్లో మెట్ట పోలాల్లో మిర్చి, పొగాకు, శనగ, మొక్కజొన్న, పత్తి పంటలను నీటి మునిగాయని తెలిపారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు అండగా ఉండాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, కారుమంచి విజయ్‌కుమార్, శాంతారాం తదితరులున్నారు.

ఘనంగా అన్నం సతీష్ జన్మదిన వేడుక

విశాలాంధ్ర - బాపట్ల : ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ జన్మదినం పట్టణంలో కాపు కళ్యాణ మండపంలో సోమవారం ఘనంగా జరిగింది. పార్టీలకు అతీతంగా అధిక సంఖ్యలో వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని వివిధ కూడలిలో, సతీష్ ఫుడ్ పార్క్ దమ్మనవారిపాలెం అభిమానులు, శ్రేయోభిలాషుల మధ్య కోలాహలంగా జరిగాయి. ముఖ్యఅతిధులుగా ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ భాజపా కో-ఆర్డినేటర్ పూరిగళ్ళ రఘురాం, భాజపా మాజీ జాతీయ కార్యదర్శి రామేశ్వర ప్రసాద్ చౌరాసియా (బీహార్), మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మ , మాజీ మున్సిపల్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశ రావు , కాపు సేవా సంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు కార్యవర్గ సభ్యులు అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

న్యాయవాద వృత్తికి సమాజంలో గొప్ప విలువ

విశాలాంధ్ర - బాపట్ల : న్యాయవాద వృత్తికి సమా జంలో గొప్ప విలువ ఉందని జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. అలాంటి వృత్తిని చేపట్టిన వారిని రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తుందన్నారు. వైఎస్ఆర్ లా నేస్తం కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ లోని డి.ఆర్.సి. సమావేశ మందిరంలో జిల్లా సంయుక్త కలెక్టర్ లాంఛనంగా చేపట్టారు. జిల్లాలో లబ్ధిదారులైన జూనియర్ లాయర్లకు శాసనమండలి సభ్యులు పోతుల సునీత, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతితో కలసి చెక్కు రూపంలో ఆయన నగదును పంపిణీ చేశారు.చట్టాలను అవగాహన చేసుకుంటూ సమాజానికి మేలు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అన్నారు. జిల్లాలో 66 మంది జూనియర్ లాయర్లకు రూ.16.50 లక్షల నగదును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. లా విద్యను అభ్యసించిన తదుపరి మూడేళ్ల వరకు ప్రతి నెల రూ.5 వేల నగదును లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. లాయర్లు మానవత దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. పౌరుల హక్కులు ఉల్లంఘనకు గురికాకుండా పనిచేయాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి జె. రాజదిబోరా, జూనియర్ లాయర్లు, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల వారికి మానవ హక్కుల దినోత్సవం సంద ర్భంగా దళిత బహుజన రిసోర్స్ కమిటీ అధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని డి.బి.ఆర్.సి కోఆర్డినేటర్ ఎస్.శ్రీలత తెలిపారు. ఈ సందర్భంగా శ్రీలత మట్లాడుతూ ఎస్సీ ఎస్టీలను ఉద్దేశించి ప్రతి వ్యక్తికి కొన్ని హక్కులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించబడ్డాయన్నారు. హక్కులు మనకు నిత్యజీవితంలో జీవించే హక్కు, మాట్లాడే హక్కు, స్వాతంత్రపు హక్కు, ఓటు హక్కు సామాజిక భద్రతా హక్కు, వీటన్నిటిని ఉపయోగించుకొని ప్రతి వ్యక్తి సమాజంలో జీవిస్తున్నాడని అంతేకాకుండా హక్కులు స్వతంత్రాలు అంతర్జాతీయ పరిస్థితులు పొందే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. ఎస్సీ ఎస్టీలను ఉద్దేశించి కుటుంబంలో తల్లిదండ్రులు ఆడ మగ వివక్షత చూపొద్దన్నారు. ఓటు హక్కు అనేది పని మనిషిని మొదలుకొని ప్రధానమంత్రి వరకు ఎటువంటి భేదం లేకుండా సమానంగా ఉపయోగించుకుంటున్నామన్నారు. ఆహార భద్రత పరిసరాల పరిశుభ్రత విద్యా వైద్యం ఆరోగ్యం పరిస్థితిలో సమన్వయంతో ఉపయోగించుకుంటూ తమ కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని ఎస్ శ్రీలత అన్నారు. ఈ కార్యక్రమంలో డి.బి.ఆర్.సి సభ్యులు పుష్ప, మౌనిక, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మిచౌంగ్ తుఫాన్ తాకిడికి ముంపునకు గురి అయ్యి పంట నాశన మవగా ఆ పొలాలను నియోజకవర్గ తెదేపా ఇంఛార్జి ఎం ఎం.కొండయ్య సంద ర్శించి రైతులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని అన్నారు. పందిళ్లపల్లి మురుగు కాలువలో తూతిక కాడ, గుర్రపు డెక్క అడ్డు పడి నీరు నిల్వ ఉండి పారుదల లేక పంట మొత్తం నాశనమైందని రైతులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ఈ విషయమై స్పందించిన విశ్రాంత ఇంజనీరు నక్కల వెంకట రమణారావు రూ.50,000 లను ఆర్థిక సాయంగా ప్రకటించి కొండయ్య చేతుల మీదుగా అప్పటికప్పుడు రైతులకు అందించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి విన్నవించి నష్ట పరిహారం రైతులకు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు గోవన ఆదెయ్య, ముంగరి బ్రహ్మయ్య, పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, కీర్తి వెంకట్రావు, పోలకం బుల్లోడు, నరాల బ్రహ్మయ్య, నరహరి శివయ్య, తెదేపా నాయకులు నాసిక వీరభద్రయ్య, పేరిశెట్ల బాలచంద్ర, గజవల్లి శ్రీనివాసరావు, బొగ్గుల పార్థసారథి, వెంగళ భరత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక చట్టం 27 రద్దు చేయాలి

విశాలాంధ్ర - రేపల్లె : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక క్రొత్త చట్టము ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు 27/22 రద్దు చేయాలని న్యాయవా దులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తొలుత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షులు కేసన వెంకటగోపాలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ప్రజా వ్యతిరేక చట్టము ల్యాండ్ టైటిలింగ్ యాక్టును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల స్థిరాస్తుల విషయములో తగాదాలు ఏర్పడినప్పుడు తగాదాలు పరిష్కరించు అధికారం సివిల్ కోర్టుల పరిధి నుంచి తప్పించి ప్రభుత్వంచే ఏర్పాటు కానున్న జిల్లా స్థాయి ట్రిబ్యునల్‌కు అధికారములు బదలీ చేయడం ఏమిటని ప్రశ్నించారు.ట్రిబ్యునల్ ఉత్తర్వులపై సివిల్ కోర్టు పరిదిని తప్పించి నేరుగా హైకోర్టుకు అప్పీలు అధికారాలు ఇవ్వటం వ్యయ ప్రయాసలతో కూడుకున్నది చెప్పారు. ట్రిబ్యునల్ చైర్మన్ గా రెవెన్యూ అధికారిని నియమించే అవకాశం ఉందన్నారు. రాజకీయ ఒత్తిడుల కారణముగా సామాన్య మానవునికి న్యాయము అందకపోగా అన్యాయము జరిగే అవకాశము ఎక్కువగా ఉందన్నారు. అంతేకాక సామాన్య మానవునికి న్యాయము అందుబాటులో ఉండదు. మరియు అతడు అనేక వ్యయ ప్రయాసాలకు లోనై దూర ప్రాంతాలకు తిరుగుతూ అనేక కష్టనష్టములకు గురిఅయ్యే అవకాశము ఉందని తెలిపారు. ప్రజానీకము, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, రైతు సంఘాలు, అందరూ తమ రాజ్యాంగ పరమైన హక్కులను కాపాడుకొనుటకు క్రొత్త చట్టమును రద్దు చేసేంతవరకు పోరాడాలని పిలుపు నిచ్చారు.